సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



3న విద్యా సాఫల్య సర్వే

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు వచ్చేనెల 3 నుంచి జిల్లాలో విద్యా సాఫల్య సర్వే నిర్వహించనున్నారు. 8లో



మానవత.. చేయూత

ఆపన్నులకు అండగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందరి మన్ననలు అందుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తోంది. 8లో



ముగిసిన చెస్ టోర్నీ

భీమవరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫైడ్ రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. 8లో

న్యూస్‌రీల్

పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ కార్యవర్గం



అసోసియేషన్‌ను ఎన్నికైన నాయకులు

తణుకు అర్బన్ : ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులంతా ఐక్యంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కె.శామ్యూల్ అన్నారు. ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులంతా ఒకే మాటపై ఉంటే ఏ అసోసియేషన్ అయినా పటిష్టంగా ఉంటుందన్నారు. ముందుగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శామ్యూల్, జిల్లా ఉపాధ్యక్షుడిగా బి.కృష్ణమోహన్, జనరల్ సెక్రటరీగా డి.విశ్వనాథరాజు, ఫైనాన్స్ కార్యదర్శిగా పి.చక్రధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి ఎస్.మురళీకృష్ణ, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

నేడు 12 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

భీమవరం(ప్రకాశం చౌక్) : జిల్లావ్యాప్తంగా సోమవారం 12 జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలంలో శివరావుపేట–1 (గాలి రామయ్య స్కూల్), కూర్మయ్యపేట (చినరంగనిపాలెం హైస్కూల్), గంధం వెంకయ్యనాయుడు స్ట్రీట్ (లూథరన్ హైస్కూల్), తాడేపల్లిగూడెం మండలంలో దొమ్మేరు కాలనీ (వెంకటరావు హైస్కూల్), కొత్తూరు (కమ్యూనిటీ హాల్), తణుకు మండలంలో పైడిపర్రు (పీహెచ్‌సీ బ్యాంక్‌కాలనీ), వీరభద్రపురం (పాత సచివాలయం), గణపవరం మండలంలో కొమర్రు సచివాలయం, ఇరగవరం మండలం కంతేరు (ఎంపీపీ స్కూల్), పాలకోడేరు మండలం గరగపర్రు (ఎంపీపీ మెయిన్ స్కూల్), యలమంచిలి మండలం మట్లపాలెం హైస్కూల్, నరసాపురం మండలం తూర్పుతాళ్లు సచివాలయంలో ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలతోపాటు రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో అసోసియేషన్ రెండో రాష్ట్ర మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ మహాసభల్లో అసోసియేషన్ నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎన్. రంగబాబు, ఏఐబీఈఏ కార్యదర్శి ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గం

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి కరుణాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జె.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బొల్లినేని రఘురాం, ముఖ్య ఉపాధ్యక్షుడిగా నీలం నాగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజామొహిద్దీన్, కోశాధికారిగా ఎస్.కొండలశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నలుగురు బాలికలు అదృశ్యం

తణుకు: తణుకు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో పదో తరగతి చదువుతున్న నలుగురు బాలికలు అదృశ్యమయ్యారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బైరెడ్డి మహాలక్ష్మి, తణుకు పాలంగి రోడ్డులో నివాసం ఉంటున్న సోనిమి రోజా, పాతవూరుకు చెందిన గాలింకి హాసిని పట్టణంలోని ఎన్జీఓ కాలనీలో కిండర్‌కేర్ స్కూల్‌లో, పాతవూరుకు చెందిన కంకిపాటి అక్షిత ఏకేటీపీ స్కూలులో చదువుతున్నారు. వీరంతా స్నేహితులు కాగా కిండర్ కేర్ స్కూల్‌లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారని చెప్పి ఆదివారం ఉదయం మహాలక్ష్మి, హాసిని, రోజా ఇంటి నుంచి బయటకు వచ్చారు. వీరు ముగ్గురు అక్షితను కలిసి అక్కడి నుంచి కనిపించకుండా వెళ్లిపోయారు. బాలిక రోజా తండ్రి శివాజీ పాఠశాలకు భోజనం క్యారేజీ తీసుకుని వెళ్లగా అనుమానం వచ్చిన స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వీరంతా అదృశ్యమైనట్టు తేలింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికల్లో ఒకరి వద్ద సెల్‌ఫోన్ ఉండగా దాని సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో వీరిని జీఆర్పీ పోలీసులు గుర్తించి తణుకు పోలీసులకు సమాచారం అందించారు. వీరిని అక్కడే సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు.



స్వామి, అమ్మవార్లకు వసంతాలు చల్లి హారతులిస్తున్న అర్చకులు



చూర్ణోత్సవంలో వడ్లు దంచుతూ..



శయన మహావిష్ణువు అలంకారంలో శ్రీవారు

వేడుకగా వసంతోత్సవం

- ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- నేటి నుంచి ఆర్జిత సేవలు పునః ప్రారంభం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం జరిగిన చూర్ణోత్సవం, వసంతోత్సవం, శ్రీపుష్పయాగోత్సవంతో ఘనంగా ముగిశాయి. గ్రహణశూల కారణంగా ఈ వేడుకలను అర్చకులు ఆలయంలోనే నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రదక్షిణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి పూజాదికాలు జరిపారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లకు వసంతాలను సమర్పించి హారతులిచ్చారు. తర్వాత చూర్ణోత్సవంలో భాగంగా శ్రీవారిని కీర్తిసూ అర్చకులు, పండితులు వడ్లను దంచారు. భక్తులపై వసంతాలను చల్లారు.

ద్వాదశ కోవెల ప్రదక్షిణలు

ఉభయ దేవేరులతో శ్రీవారికి ఆలయ ప్రాంగణంలో 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో రాత్రి నివేదన కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు, పండితులు ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో సేవాకాలాన్ని నిర్వహించారు. అలాగే ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో పిండి వంటను ఆరగింపు చేసి స్వామికి హారతులిచ్చారు. అనంతరం సుగంధ భరిత పుష్పమాలికలతో అలంకరించిన పవళింపు సేవా మందిరంలో శ్రీపుష్ప యాగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా వేడుకలను భక్తులు దర్శించి తరించారు. శ్రీహరి కళాతోరణం వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శయన మహావిష్ణువు అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు

బ్రహ్మోత్సవాలు ముగియడంతో సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

ఓటు వజ్రాయుధం

- నూతన ఓటర్ల నమోదుకు చర్యలు
- ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితా సిద్ధం
- రానున్న ఎన్నికలపై అధికారుల దృష్టి
- ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు
- జనవరి 5న తుది జాబితా విడుదల



ఎన్నికల సామగ్రి తనిఖీల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)



ఏలూరు (మెట్రో): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం. ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించిన ఎన్నికల కమిషన్ నవంబర్, డిసెంబర్ నెలల్లో ఓటర్ల జాబితా తుది మెరుగులు దిద్ది సార్వత్రిక ఎన్నికలకు తుది జాబితాను సిద్ధం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

పక్కాగా జాబితా

ఈనెల 27న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఓటర్లు ఎంత మంది ఉన్నారో అనే అంశంపై లెక్క తేల్చింది. ఈ జాబితా ప్రకారం ఏలూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా 8,09,615 మంది, పురుష ఓటర్లు 7,79,884, ఇతరులు 123 మంది ఉన్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలోనూ అధికంగా మహిళలు 7,37,824 మంది, పురుషులు 7,09,608 మంది, ఇతరులు 77 మందితో ఓటర్లు జాబితాను తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ ప్రచురణపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్ (ఏలూరు), పి.ప్రశాంతి (పశ్చిమగోదావరి) ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు సైతం నిర్వహించారు. ఎటువంటి తప్పులు చోటు చేసుకోకుండా తుది జాబితా విడుదలకు పార్టీల నాయకులు, ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికలకు పటిష్టంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్లు ప్రకటించారు.

4, 5 తేదీల్లో క్యాంపులు

మరోమారు నూతన ఓటర్లకు సైతం అవకాశం కల్పించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ మేరకు నవంబర్ 4, 5 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు సైతం నిర్వహించనుంది. అలాగే ప్రకటించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. తుది జాబితాను వచ్చే ఏడాది జనవరి 5న ప్రకటించనున్నారు. ఓ వైపు ప్రభుత్వం మరోవైపు ఎన్నికల సంఘం రానున్న సార్వత్రిక ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించి ముందుకు సాగుతోంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్‌ల తనిఖీ, మాక్ పోలింగ్ వంటి అంశాలను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారుల సమక్షంలో నిర్వహించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ చర్యలు తీసుకున్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా

ఏలూరు జిల్లా	ఓటర్లు	పశ్చిమగోదావరి జిల్లా	ఓటర్లు
పురుషులు	7,78,884	పురుషులు	7,09,608
మహిళలు	8,09,615	మహిళలు	7,37,824
ఇతరులు	123	ఇతరులు	77
మొత్తం	15,88,622	మొత్తం	14,27,509

అన్ని చర్యలూ తీసుకున్నాం

అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఓటర్ల జాబితా పబ్లికేషన్ ప్రక్రియను పూర్తిచేశాం. రానున్న రోజుల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఓటర్ల మార్పులు, చేర్పులు అభ్యంతరాలు వంటివి చేపట్టనున్నాం. వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తాం.

– ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ చైర్మన్‌గా నియమితులైన చోడగిరి చినబాబు, డైరెక్టర్లు నున్న శ్రీనాగలక్ష్మి, గార్లపాటి వీరకుమార్, కర్రి వరహాలరెడ్డి మంత్రి కొట్టును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా తాను కూడా అన్ని సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యమిస్తూ రాజకీయాల్లో కొనసాగుతున్నానన్నారు. అన్నిరకాల పదవుల విషయంలో సామాజికవర్గాల వారీగా సమతుల్యం పాటిస్తామన్నారు. గతంలో ఒక బీసీ వ్యక్తికి, ఒక మహిళకు ఇప్పుడు ఒక ఎస్సీ అభ్యర్థికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చామన్నారు. ముప్పిడి సంపత్‌కుమార్ 30 ఏళ్లుగా తనతో కొనసాగుతున్నారని అన్నారు. తన వెంట ఉన్న వారిని ఉన్నత స్థాయికి తీసుకురావాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. అలాగే కాపు సామాజిక వర్గానికి న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పదవులు కల్పించారన్నారు. ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. గత టీడీపీ హయాంలో అగ్రవర్ణాలకు చెందిన వారికే పదవులు దక్కాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు.

ఉద్యానానికి ఉపాధి ఊతం

- పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం
- రైతులకు సుస్థిర ఆదాయానికి చర్యలు



లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఆయిల్‌పామ్ తోటలో కూరగాయల సాగు

లింగపాలెం: రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నారు. అలాగే రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతులకు సుస్థిర ఆదాయాన్ని అందించేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. మామిడి, జీడిమామిడి, సపోట, ఆయిల్‌పామ్, జామ, నిమ్మ, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్, మునగ వంటి తోటల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఉపాధి హామీ పథకంలో కూలీలకు జీవనోపాధి కల్పించడంతో పాటు రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే పండ్ల తోటల పెంపకం ద్వారా ప్రయోజనం కల్పిస్తున్నారు. దీనిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నిరంతర ఆదాయం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు చెప్పగానే చెరువు పనులే గుర్తుకు వస్తాయి. ఏడాదిలో ఎన్ని రోజుల పని ఉంటుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి చర్యలు చేపట్టింది. రైతుకు నిరంతర ఆదాయాన్ని అందించేలా పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించింది. ఉపాధి హామీ పథకంలో రైతులకు మొక్కల పెంపకమే కాకుండా రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటడం, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటడం, రైతు పొలాల్లో గట్లు వెంబడి టేకు, కొబ్బరి, ఎర్రచందనం మొక్కలను నాటేలా రైతులకు ఉచితంగా అందిస్తోంది. వీటి సంరక్షణకు ఒక వ్యక్తిని నియమించి అతడికి ప్రభుత్వమే సొమ్ములు చెల్లిస్తోంది.

ఎకరాకు రూ.1.50 లక్షల వరకు..

ఈ ఏడాది జూన్‌లో ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అర్హులకు మొక్కల పెంపకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎకరా సాగులో పండ్ల తోటకు సంబంధించి గుంతలు తీసింది మొదలు మొక్కలు నాటడం నుంచి మూడేళ్ల వరకూ సంరక్షణ, నిర్వహణ ఖర్చుల కింద ప్రభుత్వం కూలీలకు చెల్లించే మొత్తం కలిపి సుమారు రూ.1.50 లక్షల వరకూ లబ్ధి చేకూరుస్తోంది.

615 మంది రైతులు : ఏలూరు జిల్లాలో 615 మంది రైతులు 986 ఎకరాల్లో మామిడి, జామ, జీడిమామిడి, సపోటా, ఆయిల్‌పామ్, నిమ్మ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, మునగ తోటలను పెంచుతున్నారు. లక్ష్యం పూర్తిచేసేందుకు కలెక్టర్, డ్వామా పీడీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు తోటల సాగు చేపట్టిన మండలాల్లో ఉపాధి హామీ పథకం సిబ్బంది రైతులచే మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టారు.

లక్ష్యానికి మించి తోటలు



ఏలూరు జిల్లాలో నిర్దేశిత గడువులోపు పండ్ల తోటల లక్ష్యాలను పూర్తిచేశాం. రైతుల భూముల్లో పండ్ల మొక్కలు వేసిన తోటలకు త్వరలో సంరక్షణకు ఖర్చులు చెల్లిస్తాం. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక శ్రద్ధతో లక్ష్యానికి మించి మొక్కలు నాటించగలిగాం. ప్రతి అంగన్‌వాడీ, పాఠశాల ప్రాంగణంలో విధిగా మునగ మొక్కలు నాటించాం. మునగ ఆకు విద్యార్థుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పండ్ల తోటల పెంపకంతో రైతులకు నికర ఆదాయంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుంది.

– అమరవల్లి రాము, డ్వామా పీడీ, ఏలూరు



తోటలను పరిశీలిస్తున్న సిబ్బంది

నగదు జమ ఇలా..

- పంట భూముల్లో గుంతలు తీసి, ఎరువులు, మొక్కల కొనుగోలు, అంతర పంటలు, నీటి తడులు వంటి వాటికి రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారు.
- రైతులే నేరుగా మొక్కలు ఖరీదు చేసేందుకు కొబ్బరికి రూ.60, మామిడికి రూ.45, జీడిమామిడికి రూ.40, నిమ్మకు రూ.25, సపోటాకు రూ.40, జామకు రూ.30 చొప్పున అందజేస్తారు
- నాటిన పండ్ల మొక్కల కాపలా, సంరక్షణ కోసం ఒక్కో మొక్కకు రోజుకు 50 పైసలు చొప్పున ఏడాదిలో 10 నెలల పాటు అందిస్తారు.
- నీరు పోసేందుకు ఒక్కో మొక్కకు రూ.5.45 చొప్పున ఏడాదికి 26 సార్లు రైతుల ఖాతాల్లో నిధులు జమచేస్తారు.
- ఇలా మూడేళ్లపాటు పండ్ల తోటలు పెంచే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది.

సామాజిక సాధికార యాత్రకు సర్వం సిద్ధం

- నేడు దెందులూరు నియోజకవర్గంలో బస్సు యాత్ర
- సోమవరప్పాడు నుంచి ప్రారంభం
- గోపన్నపాలెంలో భారీ బహిరంగ సభ



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



గోపన్నపాలెంలో సభా ప్రాంగణం

దెందులూరు : దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు సర్వం సిద్ధమైంది. సోమవారం దెందులూరు మండలంలోని సోమవరప్పాడు నుంచి యాత్ర ఆరంభం కానుంది. గోపన్నపాలెంలో బహిరంగ సభ జరిగే వేదికను ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం జగన్ ఆదేశాల మేరకు సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ జరుగనుండటం ఆనందంగా ఉందన్నారు. సోమవరప్పాడు బైపాస్ వద్ద మధ్యాహ్నం 2 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందానికి బైపాస్ వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతాయన్నారు. యాత్ర సోమవరప్పాడు బైపాస్ నుంచి వీరభద్రపురం, వేగవరం, మసీదుపాడు క్రాస్ రోడ్డు, గోపన్నపాలెం చేరుకుంటుందన్నారు. గోపన్నపాలెంలో సచివాలయం–1 గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవాలు జరుగుతాయన్నారు. యాత్రకు ముందు వీరభద్రపురం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, వేగవరం వద్ద వైఎస్సార్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రజలు సాధికార యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. సభావేదిక వద్ద ఏర్పాట్లను జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతంతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి సూచనలు ఇచ్చారు. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, కొల్లేరు నాయకులు ముంగర సంజీవ్, కార్పొరేషన్ డైరెక్టర్ ప్రభాకరరావు, సంపంగి వేణుగోపాల్ తిలక్, నాయకులు మోర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంగమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు



గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వాహనాల సంఖ్య అధికంగా ఉండడంతో సుమారు కిలోమీటరు వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న పాటెమ్మ తల్లి దర్శించుకోవడంతో పాటు పసుపులమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని అమ్మవారి గుడి వద్ద ఘనంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

బాలికల అదృశ్యంపై కేసు నమోదు

కుక్కునూరు: బెస్తగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికల అదృశ్యంపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కుక్కునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కుక్కునూరు సీఐ శ్రీనివాస్ చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు వేలేరుపాడు మండలం భూదేవిపేట కస్తూర్బా పాఠశాలలో చదువుతున్నారు. దసరా నేపథ్యంలో ఇంటికి వచ్చిన బాలికలను శనివారం ఉదయం బయటకు వెళ్లారు. తిరిగి ఇళ్లకు రాకపోవడంతో బాలికల తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారుడి మృతి



టి మోహన్ (ఫైల్)

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు టి.మోహన్(25) మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని కుటుంబ సభ్యులు ఈ నెల 8న ఏలూరులో చైత్ర ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11 గంటలకు మృతిచెందాడు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. 2021లో రాష్ట్ర సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఈ నెల 2న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టును విజయపథంలో నిలిపాడు. మోహన్ మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

3న రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలపై అంచనా కోసం
- జిల్లాలో ఎంపిక చేసిన 777 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు తొలిసారి ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖాధికారులు
- ఇప్పటికే విద్యార్థులకు ప్రాక్టీస్ టెస్ట్‌ల నిర్వహణ

దేశంలోని ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పాఠశాల విద్యా వ్యవస్థ స్వరూపాన్ని, ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న అభ్యసన ఫలితాలను అంచనా వేసేందుకు దేశవ్యాప్తంగా నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే–2023 (ఎస్ఈఏఎస్)ను నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా జిల్లాలోని ఎంపిక చేసిన 777 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్స్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు వర్క్‌షాప్‌లను కూడా విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయాల్సి ఉండటంతో ఎన్సీఈఆర్టీ మాదిరి ప్రశ్నాపత్రాలను తయారు చేసి విద్యార్థులతో ప్రాక్టీస్ టెస్టు రూపంలో 27వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తుండగా, నవంబర్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.



జల్లికొమ్మర యూపీ స్కూల్లో ప్రాక్టీస్ పరీక్ష రాస్తున్న 6వ తరగతి విద్యార్థులు



మాదిరి ప్రశ్నాపత్రంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్ పి.సౌజన్య

నిడమర్రు: దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఒకే రోజు రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే చేపట్టనుంది. ఈ నమూనా ఆధారిత విద్యా సర్వే ద్వారా జిల్లా, రాష్ట్రం, జాతీయ స్థాయిలో విద్యార్థుల అభ్యసన స్థాయిలపై నిర్మాణాత్మక నివేదిక తయారుచేస్తారు. ఈ సర్వే ఫలితాల ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, అభ్యసన అంతరాలను గుర్తించడంతోపాటు అమలవుతున్న విద్యా విధానం, బోధనా అభ్యాసనాల్లో లోపాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. విద్యార్థులను తెలుగు/ఇంగ్లిష్, గణితంపై పరిజ్ఞానం అంచనా వేసి జాతీయ సగటుతో పోల్చి రాష్ట్రాల సగటుతో ర్యాంక్‌లు ఇవ్వనున్నారు. గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి చేపట్టిన రాష్ట్ర విద్యా వ్యవస్థలో జరిగిన విప్లవాత్మక మార్పులతో జాతీయ సగటుతో పోల్చితే రాష్ట్ర సగటు ఎక్కువగా ఉండవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ సర్వేను పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని దీనిపై ఇప్పటికే ఉపాధ్యాయులకు ఎన్సీఈఆర్టీ యూట్యూబ్ ఛానల్ ద్వారా తగిన సూచనలు జారీ చేశారు.

3, 6, 9 తరగతుల విద్యార్థులకే..

ఈ పరీక్ష 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారు. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌పై, 6, 9 తరగతుల విద్యార్థులకు 5వ, 8వ తరగతి గణితం, ఇంగ్లిష్/తెలుగు సబ్జెక్ట్‌ల సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయి. తెలుగు మీడియం మ్యాప్ అయిన విద్యార్థులకు తెలుగు, గణితం పైన, ఇంగ్లిష్ మీడియం మ్యాప్ అయిన విద్యార్థులకు ఇంగ్లిష్, గణితంలో ప్రశ్నలు ఉంటాయి. 3వ తరగతి విద్యార్థులు 60 నిమిషాల్లో 40 ప్రశ్నలకు, 6వ తరగతి విద్యార్థులు 75 నిమిషాల్లో 50 ప్రశ్నలకు, 9వ తరగతి విద్యార్థులు 90 నిమిషాల్లో 60 ప్రశ్నలకు జవాబులు ఓఎంఆర్ షీట్స్ విధానంలో రాయాల్సి ఉంటుంది. దివ్యాంగులు ఈ పరీక్షకు హాజరైతే వారికి అదనంగా 30 నిమిషాలు కేటాయిస్తారు. ఈ పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులతోపాటు క్షేత్ర పరిశోధకులుగా డిగ్రీ స్థాయి, డీఈడీ విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు.

జిల్లాలో ఎంపికైన స్కూళ్లు, విద్యార్థుల వివరాలు..

యాజమాన్యం	స్కూళ్లు	తరగతి వారీ విద్యార్థుల సంఖ్య 3వ	6వ	9వ	మొత్తం
కేంద్ర ప్రభుత్వం	02	30	60	60	150
రాష్ట్ర ప్రభుత్వం	448	3,670	5,784	5,978	15,432
ప్రభుత్వ ఎయిడెడ్	19	356	356	245	957
ప్రైవేట్	308	4,685	4,202	3,713	12,600
మొత్తం	777	8,741	10,402	9,996	29,139

ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష రాసేలా చర్యలు



గత మూడు విద్యాసంవత్సరాల నుంచి తెలుగుతోపాటు ఇంగ్లిష్ మాధ్యమం కలిపి ఉన్న పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీంతో ప్రతి విద్యార్థితో ఇంగ్లీష్ మీడియంలోనే ఈ సర్వే పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి విద్యార్థికి రెండు ఓఎంఆర్ షీట్స్ అందిస్తాం. ఎన్సీఈఆర్టీ సూచనల మేరకు పరీక్ష నిర్వహించేలా హెచ్‌ఎంలు కృషి చేయాలి.

– పి.శ్యామ్‌సుందర్, డీఈవో, ఏలూరు

అభ్యసన విధానాలు మెరుగుపరుచుకోవచ్చు



వచ్చే నెల 3న నిర్వహించే ఈ సర్వే లక్ష్యం దేశంలోని ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేయడం. లోపాలను గుర్తించి గుణాత్మక బోధనతో అభ్యసనా లక్ష్యాలను సాధించేలా అవసరమైన ప్రణాళికలు దేశస్థాయిలో సిద్ధం చేసుకోవచ్చు. భవిష్యత్ అభ్యసనా విధానాలపై తగిన మార్పులకు అవకాశం ఉంది.

– సబ్బిత నరసింహమూర్తి, స్టేట్ ట్రెజరర్, ఎంఈవో అసోసియేషన్

ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం



స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే–2023ను 42 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎన్సీఈఆర్టీ నుంచి అందిన మాదిరి ప్రశ్నాపత్రాలతో ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. తరగతి గదిలో 30 మందిని మాత్రమే ఎంపిక చేసి మూల్యాంకనం చేయనున్నాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో–2, గణపవరం

క్రికెట్ బుకీపై దాడి

వీరవాసరం: క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తుండగా దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని వీరవాసరం పోలీసులు ఆదివారం తెలిపారు. సెల్ ఫోన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం బెట్టింగ్ నిర్వహిస్తున్న ప్రాంతంలో దాడులు నిర్వహించారు. వీరవాసరం గ్రామానికి చెందిన గమ్మిడి చిట్టిబాబుతో పాటు గోపాలం, చింతలకోటిగరువు గ్రామానికి చెందిన వద్దాది రాముడు, రాయకుదురు గ్రామానికి చెందిన జవ్వాది రమా వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. వీరి నుంచి టీవీ,సెల్ ఫోన్‌ను, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు.

జిమ్నాస్టిక్స్‌లో ముగ్గురికి పతకాలు



బంగారు పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో భీమవరానికి చెందిన యు.హాసిని, తన్విశ్రీ, నిత్య బంగారు పతకాలు సాధించారని శ్రీ తేజో నిధి జిమ్నాస్టిక్స్ కోఆర్డినేటర్ వి.కిరణ్ తెలిపారు. అండర్–14 విభాగంలో హాసిని, అండర్–12 విభాగంలో తన్విశ్రీ, నిత్య పతకాలు గెలుచుకున్నారన్నారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



బీచ్‌లో స్నానం చేస్తున్న ప్రజలు

నరసాపురం రూరల్: కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌ల్లో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. సందర్శకులు సముద్రంలో స్నానం చేసి తీరంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి, వేళాంకిని మాతను, 54 అడుగుల అభయాంజనేయస్వామిని, మత్స్యనారాయణస్వామిని, సాయిబాబాను దర్శించుకున్నారు. ప్రమాదాల బారిన పడకుండా సముద్రంలోకి ఎక్కువ దూరం వెళ్లకుండా పోలీసులు సందర్శకులను కట్టడి చేశారు.

రైల్వే గేట్‌మ్యాన్ నిర్వాకంతో ఇక్కట్లు



రైల్వే గేటు తీయడానికి ప్రయత్నిస్తున్న గేట్‌మ్యాన్ ప్రకాశరావు

పాలకోడేరు: పాలకోడేరు మండలం శృంగవృక్షం రైల్వే గేట్‌మ్యాన్ ప్రకాశరావు నిర్వాకంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి 10.30 రైలు వస్తుందని గేటు వేసిన అతను ట్రైన్ వెళ్లిపోయిన గేటు ఎంతసేపటికి తీయకపోవడంతో ప్రయాణికులు క్యాబిన్ వద్ద పరిశీలించారు. మద్యం మత్తులో గేట్ మ్యాన్ తికమక పడుతూ కనిపించాడు. వాహనదారులు నిలదీయడంతో తాగి డ్యూటీకి వచ్చానని.. గేట్ తీస్తున్నా రావట్లేదని వాహనదారులపై దబాయింపునకు దిగాడు. 40 నిమిషాల తర్వాత గేట్ తెరుచుకుంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే శాఖ భీమవరం సెక్షన్ పర్మినెంట్ వే ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను వివరణ కోరగా శాఖాపరమైన చర్యల్లో భాగంగా ప్రకాష్ రావును సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ముగిసిన చెస్ టోర్నమెంట్



చెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీవీఎల్ తదితరులు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని యూత్ కల్చరల్ అసోసియేషన్, పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫైడ్ రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. యూత్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నరసింహ రాజు మాట్లాడుతూ దేశంలోని 20 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, పశ్చిమగోదావరి చదరంగం అసోసియేషన్ నిర్వహించిన ఈ పోటీలకు సంపూర్ణ సహకారం అందించామని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ విజేతల వివరాలను తెలియజేశారు. ప్రథమ విజేత పి.సాయి బస్వంత్ (పశ్చిమగోదావరి)కు రూ.50 వేలు, ద్వితీయ విజేత రవితేజ (ఏలూరు)కు రూ. 25వేలు, తృతీయ విజేత మహమ్మద్ ఇమ్రాన్ (విజయవాడ)కు రూ.15 వేలు నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 130 మంది క్రీడాకారులకు రూ.ఐదు లక్షల నగదు బహుమతి అందించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి భీమారావు, యూత్ కల్చరల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల శ్రీనివాసరావు(సుభాష్), కార్యదర్శి కూసంపూడి సత్యనారాయణ రాజు(తాడినాడ సత్తులు), కలవపూడి పండు, వేగేశ్న రామకృష్ణంరాజు, తోట హరిబాబు, కోపెల్ల శ్రీను, అడ్డాల నాగరాజు, రవీంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జట్ల ఎంపిక



స్కూల్ గేమ్స్ నెట్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు

పాలకోడేరు: గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్తు క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాలబాలికల జట్ల ఎంపికలు ఆదివారం జరిగాయి. ఈ క్రీడా పోటీలను సర్పంచ్ గొట్టు ముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) ప్రారంభించి మాట్లాడారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, జిల్లా పీఈటీ, పీడీఅసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే కృష్ణారెడ్డి, ఎండీ ఖుద్దూస్, నెట్ బాల్ సంఘ కోశాధికారి దావుద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 9 నుంచి 11 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో అండర్–17 బాల బాలికల నెట్ బాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.శ్రీదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి విద్యార్థి మృతి



కొవ్వాడ అన్నవరంలో చెరువులో మునిగి మృతి చెందిన నాగ శేషువర్మ మృతదేహం

భీమవరం అర్బన్: మండలంలోని కొవ్వాడ అన్నవరంలో ఆదివారం చెరువులో స్నానానికి దిగి యువకుడు ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఇందుకూరి శ్రీనివాసరాజు, దేవి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నాగ శేషు వర్మ (17) ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పెద్దకుమారుడితో పాటు శేషు వర్మ ఉదయం చెరువులో స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా శేషు వర్మ ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతైపోయాడు. గజ ఈతగాళ్లు మృతదేహాన్ని వెలికి తీశారు. ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

టి.నరసాపురం: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చేసుకుంది. కాపుగూడెంకు చెందిన టిక్కం శ్రీనివాస్ (45) శనివారం ఉదయం 6గంటల సమయంలో గ్రామానికి సమీపంలో ఉన్న పొలానికి వెళ్ళాడు. ఇనుప ఫెన్సింగ్‌లో నుంచి వెళ్తుండగా అప్పటికే ఫెన్సింగ్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీను రాత్రయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు గాలింపు చేపట్టారు. ఫెన్సింగ్ వద్ద శ్రీను మృతదేహం కనిపించింది.

మానవత.. చేయూత

- ఆపన్నులకు అండగా నిలుస్తున్న సేవా సంస్థ
- రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాల నిర్వహణ



కోవిడ్ సమయంలో మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న మానవత సభ్యులు



మానవత దాతల సహాయంతో ఏర్పాటు చేసి ఫ్రీజర్ బాక్సు

తణుకు టౌన్: మానవ జీవితంలోని దుఃఖ సమయాలతో పాటు.. చివరి మజిలీ అభాగ్యుల వ్యథ తీర్చే సేవా సంస్థగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందరి మన్ననలు అందుకుంటుంది. మానవత సంస్థ జంగారెడ్డి గూడెం కేంద్రంగా ఏర్పడి ప్రస్తుతం రాష్ట వ్యాప్తంగా సేవలందిస్తుంది. 2004లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ఆలోచన మేరకు తన అధ్యాపక బృందం, స్నేహితులు 108 మందితో కలిసి ఈ సంస్థ ఏర్పడింది.

రామచంద్రారెడ్డి కడప జిల్లా రాయచోటి మండలం, బండపల్లె నివాసి. ఒక్కో సభ్యుడు చెల్లించిన సభ్యత్వ రుసుంతో సేవా కార్యక్రమాలు ప్రారంభించడంతో పాటు దాతల సహాయంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మానవత సంస్థ సేవలు 13 జిల్లాల్లో 101 మండలాల్లో 52,400 మంది సభ్యులతో విస్తరించి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 65 శాంతిరథాలు, 20 అంబులెన్స్‌లు, 575 ఫ్రీజర్ బాక్సులు, 15 వాటర్ ట్యాంకర్‌లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి వైద్య సాయం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 20 అంబులెన్స్‌లు, అవసరమైన చోట్ల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. విలువల పట్ల చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమయంలో ర్యాంతి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను నైతిక విలువల బోధన, కెరీర్ గైడెన్స్ వంటివి నిర్వహిస్తున్నారు. నైతిక విలువల బోధన ద్వారా వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడం కోసం కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహిస్తున్నారు. యువతకు రక్తదానం గురించి అవగాహన పెంచడం, పర్యావరణం పట్ల అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. పేద విద్యార్థులను గుర్తించి ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నారు.

కరోనా సమయంలో..

కరోనా సమయంలో మానవత సంస్థ సేవలు మరువలేనివి. కరోనాతో మరణించివారికి మానవత సంస్థ సభ్యులే స్వయంగా సమాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆక్సిజన్ కిట్‌లు అందజేశారు. పేదలకు శుభ్రమైన తాగునీరు అందించేందుకు జిల్లాలో 10 వాటర్ ట్యాంక్‌ల ద్వారా మంచినీరు అందిస్తున్నారు.

సభ్యత్వం ఎలా

మానవత సంస్థ ఆశయాలు, సేవలు నచ్చిన వ్యక్తులు, దాతలు సంవత్సరానికి రూ.600 చెల్లించి సభ్యత్వం పొందవచ్చు. 200 మంది సభ్యులు పూర్తి కాగానే మానవత నూతన శాఖ ఏర్పడుతుంది. కమిటీ నిర్ణయం మేరకు కార్యక్రమాల నిర్వహణకు నగదు బ్యాంక్‌లో డిపాజిట్ చేసి ప్రతి ఖర్చు బ్యాంక్ నుంచి డ్రా చేస్తారు.

ప్రజల శాంతి సౌభాగ్యాల కోసమే..



ప్రమాద సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు ఏర్పడిన సంస్థ మానవత సంస్థ. 108 సేవలు లేని రోజుల్లో మానవత సంస్థ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చి వందలాది ప్రాణాలను కాపాడింది. ఫ్రీజరు బాక్సులు, శాంతి రథాలు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ మొత్తం యజ్ఞం ప్రపంచ ప్రజల శాంతి సౌభాగ్యాల కోసమే.

–ఎస్.రామచంద్రారెడ్డి, మానవత సంస్థ వ్యవస్థాపకుడు

రాజకీయాలకు అతీతంగా



మానవత సంస్థ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తుంది. ముఖ్యంగా కోవిడ్ సమయంలో తమ ప్రాణాలు ఫణంగా పెట్టి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, విపత్తుల సమయంలో కూడా సేవలందించారు. వీటితో పాటు ఆరోగ్యం, విద్య, పర్యావరణం, రక్తదానం వంటిపై యువతను జాగృతం చేస్తున్నాం.

–గమిని రాంబాబు, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్, తణుకు

విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో..



ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహన పేరుతో మానవత సంస్థ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించింది. కళాశాల అధ్యాపకురాలిని కావడంతో ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకుని కెరీర్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నైతిక విలువలు పెంచేందుకు కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ కే రాధాపుష్పావతి, మానవత సంస్థ

క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఏఎంసీ చైర్మన్ సంపత్



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను ఆదివారం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ముప్పిడి సంపత్ కుమార్ దంపతులతో పాటు వైస్ చైర్మన్ చోడగిరి చిన బాబు, పాలకవర్గ సభ్యుడు గారపాటి వీరకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన పాలకవర్గం రైతు సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో కాశీకృష్ణ, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటి మిల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ముప్పడి సంపత్‌కు ఆదివారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైస్ చైర్మన్ చిన బాబు, డైరెక్టర్ వీరకుమార్‌లకు అభినందనలు తెలియజేశారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం 7గురి వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు పట్టణం, వేల్పూరు గ్రామాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి 7గురి వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు జీజీ మూర్తి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి అర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ గిరి ప్రదక్షిణ సర్వీస్‌లు ప్రశంసనీయం



ప్రయాణికులతో ఆర్టీసీ డీఎం, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యాన గత ఏడు నెలలుగా తాడేపల్లిగూడెం డిపో నుంచి నిరాటకంగా నడుపుతున్న అరుణాచలం గిరి ప్రదక్షిణ ప్రత్యేక బస్సు సర్వీస్‌లు ప్రశంసనీయమని పలువురు ప్రయాణికులు, భక్తులు పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన భక్తులతో శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం దేవాలయాలను సందర్శించిన అనంతరం ఆదివారం బస్సు గూడెం చేరుకున్న సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులకు స్వాగతం పలికారు. భక్తులు తమ యాత్ర అనుభవాలను వెల్లడించారు. కండీషన్‌తో ఉన్న బస్సులు, డ్రైవర్ల ప్రవర్తన, సౌకర్యాలతో మెరుగైన సౌకర్యవంతమైన ప్రయాణం సాగిందని చెప్పారు. మరిన్ని యాత్రలు ఆర్టీసీ ఏర్పాటు చేయాలని కోరారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధి స్థానిక బస్టాండ్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాత రైల్వే గేటు సమీపంలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆకు పచ్చరంగు, తెలుగు చారలు కలిగిన చొక్కా, నీలంరంగు జీన్స్ ఫ్యాంటు ధరించిన వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

నేడు అలంపురంలో షుగర్ పరీక్షలు

పెంటపాడు: హైదరాబాద్ జూబ్లిహిల్స్ ఆపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్ అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆసుపత్రిలో సోమవారం పరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య పరీక్షల్లో భాగంగా షుగర్‌కు సంబంధించి పాదాలలో తిమ్మిర్లు, మంట, స్పర్శ తగ్గుట, మానని పుండ్లు, పాదముల వంకర, ఇన్‌ఫెక్షన్, గాంగ్రీన్ తదితర లక్షణాలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి మైనర్ ఆపరేషన్ ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): బెంగళూరు నుంచి విజయవాడ ఆటోనగర్ వస్తున్న ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్‌పై అత్యంత కిరాతకంగా చేసిన దాడి ఘటనను తాడేపల్లిగూడెం ఆర్టీసీ ఉద్యోగులు ఖండించారు. స్థానిక డిపో వద్ద ఆదివారం ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన సుమారు 100 మంది ఉద్యోగులు డ్రైవర్‌కు సంఘీభావం ప్రకటించారు. నిరసన తెలియజేస్తూ దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గాయపడిన ఆర్టీసీ డ్రైవర్‌కు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించాలని కోరారు. ఉద్యోగులు ఎ.రవికుమార్, రవిశంకర్, సీహెచ్ వెంకట రమణ, శ్రీను, ఎం.ఎస్.బాబు, ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో..

తణుకు అర్బన్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ తణుకు డిపో ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యాన ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న విజయవాడ ఆటోనగర్ డిపో డ్రైవర్ బి.రాంసింగ్‌పై దుర్మార్గంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఎంయూ డిపో కార్యదర్శి ఎన్.సుబ్బారావు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఆలీ, డిపో సెక్రటరీ వాసు, కె.దుర్గాప్రసాద్, సాంబశివరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ దుర్గారావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ సభ్యులు

కులాల వారీగా జనగణన చేపట్టాలి

బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వం వెంటనే కులాల వారీగా జనగణన చేపట్టాలని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. సంఘ సమావేశాన్ని గొల్లలకోడేరులో మండలాధ్యక్షుడు దొమ్మేటి వేణుగోపాల్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల్లో కచ్చితంగా 34 శాతం రిజర్వేషన్ కొనసాగించాలన్నారు. దేశంలో అనేక కులాలు రిజర్వేషన్ లేకపోతే ఆర్థికంగా ముందుకు సాగలేవని ఉద్దేశంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. దేశంలో ఎన్నో కులాలు ఉంటే కేవలం 10 కులాలు మాత్రమే అసెంబ్లీ, పార్లమెంట్ గడపలు తొక్కుతున్నాయని అన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ ప్రకటించడం ద్వారా బీసీలను ముంచినట్లేనని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అసలు రిజర్వేషన్‌కి అర్థం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్పాడా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రమణ్యం, మండల ఉపాధ్యక్షుడు నేతల గోపి, గౌరవాధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

మంత్రి కొట్టును కలిసిన ఆర్డీవో అంబరీష్



ఉప ముఖ్యమంత్రి కొట్టుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నర్సాపురం ఆర్డీవో అంబరీష్

తాడేపల్లిగూడెం అర్బన్ : నరసాపురం ఆర్డీవోగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అంబరీష్ ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారిరువురూ శాఖ పరమైన విషయాలపై చర్చిచారు. ఆర్డీవో హోదాలో ప్రజలకు సేవలందించాలని మంత్రి కొట్టు అభిలషించారు.

ఉల్లి ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలన్

ఉండి: పెరుగుతున్న ఉల్లి ధరలను తగ్గించి కిలో రూ.20లకే ప్రజలకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఉండిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు ఉల్లిని అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని అన్నారు. ఉల్లి అక్రమ నిల్వలపై దాడులు చేసి ధరను అదుపులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు మాదాసి గోపి, చీర్ల శేషు, కిలారి తవిటినాయుడు, నిమ్మితి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సాక్షి, భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని, ఆటలకు వయస్సుతో పనిలేదని ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం లూథరన్ హైస్కూల్లో ఏపీ బహుజన జేఏసీ 3వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా జేఏసీ సభ్యులు ఐకమత్యంతో వివిధ రకాల క్రీడలను ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడం ఆనందించదగిన విషయమన్నారు. గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీ రాజు, జెఏసి అధ్యక్షులు కొనా జోసఫ్, తాళ్లూరి మధు మాట్లాడుతూ పురుషులకు క్రికెట్, కబడ్డీ, కోకో, మహిళలకు మ్యాజిక్ చైర్స్ పోటీలను నిర్వహించామని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈది రవికుమార్, కోనా రంజిత్, బిరుదుగడ్డ రమేష్ బాబు, మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీను ప్రారంభిస్తున్న ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు

8న పాలకొల్లులో సామాజిక సాధికార యాత్ర



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో నవంబర్ 8న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను ప్రతి కార్యకర్త తమ భుజస్కంధాలపై వేసుకుని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పిలుపు నిచ్చారు. బస్సుయాత్ర కార్యాచరణపై ఆదివారం పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవన్‌లో వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పాలకొల్లులో నిర్వహించే బస్సుయాత్రపై అధిష్టానం ఎంతో నమ్మకం పెట్టుకుంటుందన్నారు. ఈ బస్సుయాత్రకు నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, పోడూరు, యలమంచిలి మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. బస్సుయాత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మంత్రులు పాల్గొంటారన్నారు. బస్సుయాత్ర పూలపల్లి మలుపు వద్ద నుంచి 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి గాంధీబొమ్మల సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతీ వార్డు నుంచి కనీసం 500 మంది గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకునేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో చింతలపూడి, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, మామిడి వెంకటేశ్వరరావు (బాబు), పార్టీ నాయకులు అడబాల వెంకటరమణ, మద్దా చంద్రకళ, కొప్రగింజల శ్రీనివాసరావు, బండి రమేష్, చినిమిల్లి గణపతిరావు, జోగాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ కన్వీనర్స్ బుద్ధరాజు వెంకట పతిరాజు, ఆకెన కేశవరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి నగరంలోని వేమగిరి ప్రాంతంలో ఉన్న పరమహంస యోగానంద నేత్రాలయ సంస్థ వైద్యులు ఈ శిబిరంలో పరీక్షలు చేస్తారన్నారు. పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని వారు వివరించారు. ఆంధ్రాబ్యాంకు శతజయంతోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: సమాజంలో కంటికి కనిపించే ప్రత్యక్ష దేవుళ్లు వైద్యులని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఐఎంఏ హాలులో ఆదివారం తణుకు ఐఎంఏ, విజయవాడ అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యాన జరిగిన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సును ఉద్దేశించి విశాఖపట్నం నుంచి ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. వైద్యరంగంలో తణుకు ప్రాంతం మరింతగా అభివృద్ధిచెందేలా వైద్యులు కృషి చేయాలన్నారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ గాజుల రమేష్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కాలానుగుణంగా వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. రొమ్ము క్యాన్సర్ శస్త్ర చికిత్సలు, న్యూరాలజీ, పీడియాట్రిక్, నియోనేటల్, కార్డియాక్, రేడియాలజీ విభాగాలకు సంబంధించి పలు అంశాలను అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వైద్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఐఎంఏ వైద్యులు పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ కె.రవికుమార్, ఐఎంఏ సీనియర్ వైద్యులు డాక్టర్ తాతిని రామబ్రహ్మం, అధ్యక్షుడు ఎం.రఘు, కార్యదర్శి బి.రమేష్ కుమార్, డాక్టర్ వత్సవాయి వెంకటరాజు, డాక్టర్ వి.సుందరరావు, డాక్టర్ వి.సరోజిని, డాక్టర్ కేఎస్ఎన్ రాజు, డాక్టర్ బూరుగుపల్లి వెంకట్రావు, డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రామబ్రహ్మం

కళాకారుల సంఘ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నెలవారీ సభా కార్యక్రమం, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆదివారం రాత్రి గీతా మందిరంలో సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించారు. వైద్యులు అవినాష్‌కు గౌరవ సత్కారం, గాయకులు మావూరి రామకృష్ణకు కళా సత్కారం, రచయిత కోట రామప్రసాద్‌కు ఉద్యోగ సేవా పురస్కారం, సీనియర్ కళాకారులు రాఘవులకు ఆర్థిక సత్కారం అందజేశారు. కళా సత్కార గ్రహీత రామకృష్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మండవల్లి చెన్నా నాగేంద్ర, జానకీరత్నం దంపతులు, సీనియర్ టైలర్ ఆకాశపు స్వామి, షేక్ బాజీ, ఎన్‌వీ సత్యనారాయణ, కాకర్ల సుభద్ర, సాయి చిరు, నాగేశ్వరరావు, వంశీకృష్ణ, మురళీకృష్ణ, బాబూరావు, కృష్ణ, కళాకారులు తదితరులు హాజరయ్యారు.



భగవద్గీత పారాయణం చేస్తున్న రామకృష్ణ

వైభవంగా దుర్గమ్మ గ్రామోత్సవం

పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. బాణసంచా, శక్తి వేషాలు, తీన్‌మార్, కేరళ డప్పుల విన్యాసాలు, ఆసాదుల నృత్యాలు, కాంతార శక్తి వేషాల నడుమ పూలరథంపై అమ్మవారు ఊరేగారు. ప్రత్తిపాడు, కాగులంపాడు, కృష్ణాయపాలెం గ్రామాలలో అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఊరేగించారు. తొలుత ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కొత్తలంక శివ సత్యనారాయణ, తాడిపర్తి వీరాస్వామి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సైపురెడ్డి రాంబాబు, జవ్వాది శేష గిరిరావు, కాసాని శ్రీనివాస్, తుమ్మగంటి భాగ్యలక్ష్మి, నూనె గణపతి, ఆకుల చంద్రరావు తదితరులు పర్యవేక్షించారు.



అమ్మవారి ఊరేగింపు దృశ్యం

సీఎం సహాయ నిధి పేద రోగులకు ఆసరా



చెక్కులు పంపిణీ చేస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: సీఎం సహాయ నిధి పేద రోగులకు ఆసరాగా నిలుస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని పెద అమిరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఉండి నియోజకవర్గంలో దొడ్డనపూడి, కాళ్ళకూరు, ఎస్ఆర్పీ అగ్రహారం, సిద్దాపురం గ్రామాలకు చెందిన రోగులకు రూ.5.40 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు ఆర్థిక ఇబ్బందుల వల్ల అనారోగ్యం బారిన పడకూడదనే లక్ష్యంతో ఆదుకుంటున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని పేద రోగులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటూ ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడుతున్నారన్నారు. అన్నివిధాలుగా ప్రజలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరిన్ని సేవలు చేస్తారని అన్నారు. ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, ధనుంజయ్, గుండా సాయి, వేగేశ్న విజయరామరాజు, నారాయణ రాజు, చిగురుపాటి చిట్టిబాబు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

అత్తిలి: అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులకు మానవత ఆధ్వర్యాన ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కొమ్మర గ్రామస్తులు వేగి పెద్దిరాజు, ధనలక్ష్మి దంపతులకు రూ.10 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అర్చకుడు కె.శ్రీనివాసులుకు వైద్య ఖర్చులకు రూ.5 వేలు సాయంగా అందజేశారు. అత్తిలి సొసైటీ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అత్తిలి కార్యదర్శి ఎం.సత్యనారాయణ మానవత తరపున ఈ మొత్తాన్ని వారికి ఇచ్చారు. అత్తిలి మానవత కార్యదర్శి కొరిపల్లి హరి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 28వ వార్డు కడకట్ల డాక్టర్ కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యాన జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ సామ్యూల్ కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పళ్ళు (డెంటల్) జనరల్ సర్జన్, ప్రసూతి, స్త్రీ వైద్యం, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, శ్వాస కోశ, గుండె వైద్య నిపుణులు సేవలు అందిస్తారని చెప్పారు. 27వ వార్డు నుంచి 35వ వార్డు వరకు ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

తాడేపల్లిగూడెం: స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌లో రాజమండ్రి వైపు వెళ్తున్న రైలు కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందినట్లు తాడేపల్లిగూడెం రైల్వే పోలీసులు తెలిపారు. ఆదివారం సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గూడ్సు రైలు కిందపడి మరణించాడు. పింక్ కలర్ షర్టు, సిమెంటు కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో గుర్తింపు కోసం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చారు. రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిస్తే 94906 17090 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఆక్వా సదస్సుకు పీవీఎల్‌కి ఆహ్వానం

కాళ్ల: వచ్చేనెల 2వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కాళ్ల మండలం పెద అమిరంలో ఆక్వా ఎక్స్‌పో ఇండియా ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆక్వా ఎక్స్‌పో సీఈవో దంతులూరి వేణు ఆదివారం తెలిపారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో పెద అమిరం రోడ్డులోని రాధాకృష్ణ కన్వెన్షన్ సెంటర్‌లో ఆక్వా ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును పెద అమిరం పార్టీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఎక్స్‌పోలో 100 స్టాళ్లకు పైగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాళ్ళ, పాలకోడేరు ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథరాజు, భూపతి రాజు చంటిరాజు, కుముదవల్లి సర్పంచ్ వంశీకృష్ణంరాజు, సాగిరాజు హరి వర్మ, కలిదిండి బుజ్జి, పెనుమత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. జ

నేడు తూర్పుతాళ్లులో జగనన్న ఆరోగ్య సురక్ష

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని పీఎం లంక రోడ్డులో ఉన్న గ్రామ సచివాలయం.2 వద్ద జరిగే ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు వచ్చి రోగులకు సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మట్లపాలెంలో

యలమంచిలి: మండలంలోని మట్లపాలెం, గంగడుపాలెం గ్రామాలకు సంబంధించి సోమవారం మట్లపాలెం గ్రామంలోని పేరిచర్ల సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ వెంటే అట్టడుగు వర్గాలు

నరసాపురం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు వర్గాల వారు వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నరసాపురంశాఖ అధ్యక్షుడు తిర్రే బాబూరావు అన్నారు. నరసాపురంలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రకు అపూర్వ స్పందన రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులు, బీసీలతో సహా అన్ని వర్గాల వారు సీఎం జగన్ సాగిస్తున్న ప్రజారంజక పాలనకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న బస్సుయాత్రకు అన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ ఇందుకు నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రావన్నారు.